


# ప్రయాణం

టి.వి. కళ్యాణి

ఆదివారం రాత్రి అందరం సీరియస్‌గా సిబాకా గీత్‌మాలా చూస్తున్నాం.

ఖంగున మోగింది కాలింగ్ బెల్.

మంగలిని చూసి ఎద్దు కుంటినట్లు, నే నక్కడ ఉండడంతో ఎవరూ కదల్లేదు.

విసుక్కుంటూ లేచి తలుపు తీశా. బయట బల్బుపోయి నాలుగు రోజు లయింది. చీకట్లో ఆకారం నన్ను తోసుకుంటూ లోపలికి జొరబడింది.

భయంతో 'కెవ్వ్!' మని అరిచాను.

అంతే! ఇంట్లో అందరూ ఎలర్ట్ అయిపోయారు.

"పిన్నీ! నువ్వా!" అంది మా సుపుత్రి.

తేరుకున్న నేను "ఏమిటే ఆ దూకుడు! హడలగొట్టి చంపావ్ కదే!" అన్నాను.

"బాగున్నారా!"

మావారి పలకరింపుకి తన వేపు తను చూసుకుని - నా వేపు తీక్షణంగా చూసి నవ్వీ నవ్వనట్లు 'ఎక్స్‌ప్రెషన్' ఇచ్చి కుర్చీలో కూర్చుంది.

ఆ భంగిమ చూసి తనన్నమాటలో పొరపాటుందా అని ఒక్క క్షణం ఊర్కుని - "ఈస్ట్-కోస్ట్'లోనా రావడం" అని మళ్ళీ అడిగారు.

అంతే 'గయ్' మంది. "నన్ను చూస్తే మీకు వేళాకోళంగా ఉన్నట్లుంది. దెయ్యంలా ఉన్న నన్ను బాగున్నావా అని అడగడం, రైలు నా కోసం స్పెషల్‌గా వేసినట్లు 'ఈస్ట్-కోస్టా' అని అడగడం రాగానే నా మూడ్ పాడుచేశారు రావు గారూ! మీ పద్ధతేం బాగులేదు."

అదెప్పుడూ మావారికి వజిలే.

"ఏరా మణీ! మీరు వచ్చినప్పుడు ఎన్ని గంటలకి వచ్చింది."

"రాత్రి పది గంటలకి." ఠకీమని జవాబిచాడు మా సుపుత్రుడు.

"ఎన్నాళ్లయింది వచ్చి?"

"ఇరవై రోజులు."

"చూశారా రావు గారూ! ఇరవయి రోజుల్లో ఈస్ట్-కోస్ట్ బుద్ధి మారిపోయిం దనుకున్నారా?" నవ్వుతూ అడిగింది కాంతి.

"లేటు మార్పు లుండచ్చు గదా! అందులో వచ్చింది రైల్వే వాళ్లాయే." మావారు చురక అంటించారు.

"పిన్ని మెయిల్లో వచ్చుంటుంది నాన్నారూ!"

"ఏరా! మణిగా, నే బండెక్కితే పన్నెండు గంటలు లేటవుతుందా!"

"అమ్మా తల్లీ! ఎందులో వచ్చావో చెప్పొద్దుగానీ, ముందు స్నానం చేసిరా, అందరం

కలిసి తిండి తిందాం!" రెండు చేతులూ జోడించి అన్నాను.

న న్నుద్ధరిస్తున్నట్లు లేచి స్నానానికి వెళ్లింది.

కాంతి నా ప్రాణ స్నేహితురాలు. మే మిద్దరం మూడో క్లాసు నించి డిగ్రీ పూర్తయ్యే దాకా కలిసి చదువుకున్నాం. మావి పక్క పక్క ఇళ్లు కావడంతో ఎప్పుడూ కలిసే ఉండేవాళ్లం. కాంతి మేనత్తకొడుకు - వాళ్ల వాళ్లు 'ఉప్మాక'లో ఉండడం వల్ల ఆ పల్లెటూళ్లో అప్పట్లో స్కూలు లేకపోవడం వల్ల వైజాగ్‌లో కాంతి వాళ్లింట్లో ఉండి చదువుకునే వాడు. మా కంటే రెండేళ్లు సీనియర్. ముగ్గురం ఒకే జట్టుగా తిరిగే వాళ్లం. కాంతి వాళ్లత్త కొడుకునే చేసుకుంది. ఇంత పెద్దవాళ్లం అయినా మా మధ్య స్నేహం గాఢంగా అలాగే నిలిచి, మా కుటుంబాల మధ్య మూడు పువ్వులు - ఆరుకాయలు చందాన దిన ప్రవర్ధమాన మవుతూంది. మా వారు పై వారైనా త్వరగానే మాలో కలిసిపోయారు. కాంతి బాంకులో పని చేస్తూంది. వాళ్లాయన రైల్వేలో టి.టి.సి. రైలు వాళ్ల సొంతం కనుక ఎక్కువగా వాళ్లే వస్తుంటారు. మే ముండేది కలకత్తాలో.

ఉరుములేని పిడుగు ఒక్కటే వచ్చింది ఈమారు - అదే ఆశ్చర్యం. అడిగితే చచ్చినా చెప్పదు. దానంతట అదే చెప్పాలి. అంతవరకు వేచి చూడాల్సిందే.

అందరం సరదాగా, కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తున్నాం.

"ఏ బండిలో వచ్చావు పిన్నీ?" మా సుపుత్రిక జీళ్ల పాకంలా పట్టుకుంది.

గొంతు సవరించుకుని. "కథా వైనం బెట్టిదనినా.... నేను కలకత్తా వెళ్లాలీ అనగానే మీ బాబాయ్ నువు కష్టపడ్డం నా కిష్టం లేదంటూ 'కోరమండల్' ఎక్కించారు. అక్కడితో ఆయన పని అయిపోయింది. ఇంక నా పాట్లు చూడు - విపరీతంగా జనం, బాత్‌రూమ్‌లో నీళ్లు లేవు, ఈ బండి ఎక్కడా ఎక్కువ కాసేపు ఆగిచావదు. అది అర్థాంతరంగా అడవిలో ఆగిన చోట మనకి మంచినీళ్లు కూడా పుట్టవు. ఆఖరికి ఖరగ్‌పూర్‌లో దిగి స్టేషన్లో మొహం కడుక్కుని ఇన్ని కుడితినీళ్లు తాగాను. రెండు అరిటికాయలు మింగాను. వెధవ ప్రయాణం విసుగెత్తిపోయింది. కలకత్తాలో ఉన్నందుకు మిమ్మల్నందరిని వరసపెట్టి తిట్టుకుంటూ ప్రయాణం చేశాను."

"అబ్బో! నువ్వొకత్తివే అష్టకష్టాలు పడుతున్నట్లు పోజు పెట్టకుగానీ - మేం నీ కంటే ఎక్కువ బాధలు పడి వచ్చాం. మరి జన్మలో ప్రయాణం చెయ్యకూడదని నిర్ణయించుకున్నాం."

నా మాట పూర్తి కాకుండానే "అమ్మో! అమ్మో! అంత వైరాగ్యం పెంచుకోకండే - నా గతేంగాను, గంపెడంత ఆశతో వచ్చాను. పద్మాలు పెళ్లికి కొండంత సాయంగా మీ రుంటారని నేను మా ఆయన కలలు కంటున్నాం."

"చత్! ముందు నీ గోల ఆపి సరిగ్గా చెప్పు. పద్మాలు పెళ్లి కుదిరిందా? ఎప్పుడు ముహూర్తం?"

"రాని వాళ్లని పిలవ వేడుకట. వైరాగ్యంలో మునిగిన మిమ్మల్ని పిలిచేం లాభం?"

"తిన్నగా చెబుతావా రెండు తగలనివ్వనా?" అన్నా కోపంగా.

"పగలంతా ఉపోషం, ముందు తిననీ, - తర్వాత అడగొచ్చు." మా వారు మెల్లిగా నన్నాయి నొక్కులు నొక్కినట్లు అంటుంటే.

"మీరు నన్ను సపోర్టు చెయ్యక్కరలేదు. మళ్లీ నెల ఫస్టున పెళ్లి మీ రందరూ మూడు రోజుల ముందు రండి చాలు" అంది కాంతి.

"అదేవిటోయ్! పెళ్లికి పది రోజుల ముందు రమ్మని పిలుస్తారుగానీ మరీ బొత్తిగా మూడు రోజుల ముందు రమ్మనడం - అందులో నీ ప్రాణ స్నేహితురాలు అలా పిలవడం చూస్తుంటే."

"ఏమిటి నాన్నగారూ! అలా అనకపోతే పిన్ని పిసినారి అని డైరెక్ట్‌గా అనొచ్చుగా."

"ఔన్రా మణీ! నీ పాటి ధైర్యం మీ నాన్నకి లేదు." మెచ్చుకుంది కాంతి.

"మా అమ్మ - నాన్నా ప్రయాణం చెయ్యమని గట్టిగా అనుకుని నెల రోజులు కూడా కాలేదు, పిన్నీ! నువ్వొచ్చి ప్రయాణం పెట్టావ్." మా సుపుత్రిక ఉవాచ.

"నువ్వు చిన్నదానివి నీకు తెలీదింకా. మన జీవితాల్లో ప్రసూతి వైరాగ్యం లాంటిదే ప్రయాణం వైరాగ్యం కూడా" కాంతి ఉపదేశం.

మా కాంతికి చదువుతుండగానే వాళ్ల మామ్మ సీరియస్‌గా ఉండడంతో పెళ్లి చేసేశారు. మరునటి సంవత్సరం పద్మాలు పుట్టేసింది. ముని మనవరాల్ని చూసి మరీ శెలవు పుచ్చుకుంది వాళ్ల మామ్మ.

ఇరవై ఏళ్లు పద్మాలుకి, మంచి సంబంధం కుదిరిందని చేసేస్తున్నారు. మా కాంతికి అల్లు డొచ్చే వయసొచ్చింది కానీ, మనిషిలో మార్పు రాలేదు. దానిలో పెద్దరికం మచ్చుకి కూడా కనపడదు.

"పోనీ మమ్మల్ని వదిలేసి మీ స్నేహితురాల్ని పిలవకూడదూ" అన్నారు మా వారు.

"ఏదీ మరో మారు అనండి ఆ మాట."

అబ్బే! ఏం లేదు అందరం కలిసి మరోమారు అవస్థలు పడడానికి సిద్ధపడదాం అంటున్నాను."

"అలా రండి దారికి - రెండు రోజుల షాపింగ్‌కి మీరూ రావాలి" అల్టిమేటం జారీ చేసింది.

కాంతి ఉన్న మూడు రోజులూ హడావిడిగా గడిచిపోయాయి.

కలకత్తా కాటన్ చీరలు బాగుంటాయని వచ్చిన వాళ్లకి పెట్టడం కోసం తీసుకుంది. బ్లౌజు పీసులు, పరికిణీలు, బేగ్‌లు మొత్తం మీద చాలా షాపింగ్ చేసింది.

"నన్నూ నా లగేజిని మెయిల్లో పడెయ్యండే" అని మొత్తుకుంటుంటే నేను, మా వారు బండెక్కించడానికి స్టేషన్‌కి వచ్చాం.

ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకుంటారని భయపెట్టి రెండు గంటలు ముందుగానే ఫ్లాట్‌ఫాం మీద పడేశారు మావారు.

లగేజి అంతా లెఖ్ఖ చూసి "నీ దగ్గరికి ఎప్పు డొచ్చినా లగేజి ఎక్కువే. అదే నచ్చదు. నాకు" నింపాదిగా అంది కాంతి.

బండెక్కేముందు ఎందుకులే ఏ మాటన్నా అనడం అని వినీ విననట్లు ఊరుకున్నాను.

కాని అది నోరు ముయ్యదుగా!

"ఎంచక్కా కిందటివారం మద్రాసు మా ఆడబడుచు దగ్గరికి వెళ్లినప్పుడు షాపింగ్ చేసిందంతా సూట్‌కేస్‌లో పెట్టుకుని స్టైలుగా ట్రైనెక్కాను. అయినా మద్రాసు షాపింగ్ మజాయే వేరు." అంది కవ్వింపుగా.

"నాలుగు వేలకి ఓ చీర కొన్నా వక్కడ. నాలుగు వేలకి నలభై చీరలు కొన్నా విక్కడ. తేడా లేదూ?"

"ఇప్పుడు పెళ్లికి తప్పకుండా రావాలి - మీ రిద్దరూ గిల్లికజ్జాలు పెట్టుకుని పెళ్లి మర్చిపోతారు. 'అల్లివళ్ల సందట్లో పెళ్లి మర్చిపోయినట్లు'. రింగ్ మాస్టర్ లేకుండా పిన్ని వచ్చిందని పద్మాలు బాధపడకుండా ముందే జాగ్రత్తపడడం మంచిది."

ఇద్దరినీ మార్చి మార్చి చూస్తూ అన్నారు మావారు.

"ముందంత రాను, రాను అని మురిపించుకుని ఆఖరున ఇందుకోసమన్నా ఒప్పుకున్నారు, చాలా సంతోషం. పెళ్లి పెత్తనం మీదే." నవ్వుతూ అంది కాంతి.

"అరె! బాప్‌రే! అంత భారం పెట్టకండి. మిమ్మల్ని కనిపెట్టి పెళ్లి సంగతి గుర్తు చేయడమే పెద్ద పని నాకు. ఈ మధ్య ప్రయాణంతో నిజంగానే విరక్తి కలిగింది. అత్యవసర పరిస్థితులలో తప్ప ఎక్కడికి వెళ్లగూడదనే అనుకున్నాం. కానీ వెంటనే ప్రయాణం తగిలింది."

"నాకూ? అంతేనే. ప్రయాణ భయం తప్ప అందరిని కలవాలని నాకు మాత్రం లేదుటే." వంత పాడాను మావారికి.

మా మాటల మధ్యలో బండి వచ్చేసింది.

జాగ్రత్తగా కాంతిని, లగేజిని బండెక్కించి రైలు




## మరో చోలీ పాట...



'దిల్‌బర్' చిత్రంలో మరో చోలీ టైపు పాట పెట్టారు. ఈసారి చోలీ నటి మమతా కులకర్ణి. ఈ మధ్యే ఈ చిత్రం సెన్సారుకు వెళ్లినప్పుడు బోర్డులోని స్త్రీ సభ్యురాళ్లంతా చోలీ పదాన్ని తొలగించాలని పట్టుబట్టారట. అయినా విశాల హృదయంతో సెన్సారు బోర్డు వారు ఆ పాటను అలాగే ఉంచి సర్టిఫికెట్ ఇచ్చారట. "మేం పాటలో చోలీ అన్నా ఉంచాం... సంతోషించాల్సింది పోయి బాధపడతే ఎలా?" అని పనిలో పనిగా నిర్మాత ఓ ఛలోక్తి కూడా విసిరాడట. అయ్యో? అదీ సంగతి

మసూద్ అన్సారి




కదలగానే తిరిగి వచ్చేశాం.

కాంతి వెళ్లిపోతే గాలి, వానా వెలిసినట్లే ఉంది.

మా అత్తయ్య 'మేనత్తకొడుకు ఓ మొగుడేనా - వంకాయ కూర ఓ కూరేనా!'' అంటుంది తరుచు.

ఓసారి మా కాంతి కాపురాన్ని చూపించి, వాంగీ బాత్ చేసిపెట్టాలి ఆవిడకి. మరెప్పుడూ ఆ ముక్క అనకుండా.

రామాయణంలో పిడకలవేటలా మా అత్తయ్య ప్రసక్తి ఎందుకు?

అనుకున్న ప్రకారం అందరం మూడు రోజుల ముందుగా విశాఖ చేరాం. మమ్మల్ని చూసి వాళ్లు సంబరం అంత ఇంత అని మాటల్లో చెప్పలేం. కాంతి బంధువు లందరూ నాకు తెల్సిన వాళ్లే గనక పగలంత కబుర్లతో సరదాగా గడిచిపోయింది.

ఎవరూ కష్టపడక్కర లేకుండా అన్నీ కేటరింగ్ కిచ్చేశారు. టైమ్ ప్రకారం వంటలు వచ్చేస్తాయి. పెళ్లినాడు మాత్రం వడ్డనకి మనుమలని పెట్టారు. రైల్వే కళ్యాణ మండపంలో పెళ్లి. వియ్యాల వారిది ఆ ఊరే కనుక ఉదయం వచ్చి రాత్రికి వెళ్లిపోతారు. సాయంత్రం ఆరూ యాభై అయిదుకి ముహూర్తం. పెళ్లివారికి బట్టల నిమిత్తం ముందే డబ్బిచ్చేశారు కనుక ప్రత్యేకంగా పెట్టవల్సినవి ఏమీ లేవు. వాళ్ల ఇంటికి దగ్గిరగా ఉన్న ఖాళీ క్వార్టర్లు రెండు, మరి రెండిళ్లలో గదులు అడిగి పుచ్చుకోవడం వల్ల రాత్రి భోజనాలు అయ్యాక అందర్నీ అన్నిళ్లలో సర్ది మా కుటుంబాలు మాత్రం వాళ్ల అసలు ఇంట్లో ఉండిపోయాం. చాలాసేపు పెళ్లి కబుర్లు చెప్పుకుంటూ గడిపేశాం.

ఇంతలో సిసింద్రీ మా కాంతి కొడుకు ''పిన్నీ! మీరు ఈమధ్య ఈస్ట్-కోస్ట్‌లో ఎడ్వెంచర్స్ చేశారని మా మమ్మీ చెప్పింది. మా క్కూడా వివరంగా చెప్పండి'' అన్నాడు.

మావారు కల్పించుకుని ''ఈనాడు అందరూ పడుతున్న ఈతిబాధలే నాయనా! పెద్దగా చెప్పేందుకేం లేదు గానీ హాయిగా పడుకో'' అన్నారు.

''బాబాయ్! మీ రుండండి - పిన్నీ నువ్వు చెప్పు'' అన్నాడు మళ్లీ.

చెప్పనా అన్నట్లు మా వారి వేపు చూశాను.

''మిస్టర్ మూర్తి యుద్ధానికి సిద్ధంకండి'' అంటూ తను దూరంగా జరిగారు.

''పిన్నీ! వివరంగా చెప్పాలి కట్టె - కొట్టె - తెచ్చేలా కాదు.''

''రైలు ఎన్ని నిముషాలు ఎక్కడ ఆగిందే, రైల్లో అమ్మొచ్చిన వాళ్ల రూపురేఖలతో సహా అన్నీ వివరంగా చెప్పు తల్లీ! మా వాడు భవిష్యత్తులో టి.వి. సీరియల్ తియ్యాలని ప్లాన్ చేస్తున్నాడు. అందుకే ప్రతి విషయానికి చాలా ఇంపార్టెన్స్ ఇస్తాడు'' మూర్తి తన హాస్యధోరణిలో అన్నాడు.

జూన్ రెండవ తారీఖు సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంది. ఉన్నట్టుండి ఈదురుగాలులతో నుడి వచ్చింది. ఆ రాత్రే మా ప్రయాణం. ఏ క్షణాన కుంభవృష్టి కురుస్తుందో అని అందరం భయపడ్డాం కాని ఎనిమిది గంటలకి వాతావరణం ప్రశాంతంగా మారిపోయింది. స్టేషన్‌కి ఫోన్ చేశాం. బండి అరగంట ఆలస్యమని జవాబు. ఆనందంగా మా మరిది కార్లో స్టేషన్ చేరాం. ఎవరినీ స్టేషన్‌కి రావద్దన్నాం. రిజర్వేషన్ ఉంది. మళ్లీ రాత్రి మీరు తిరిగి రావడం కష్టం అని వారించాం. రాత్రి పదయింది. స్టేషన్లో లైట్లు పది నిముషాలు వెలగడం, పావుగంట ఆరిపోవడం. డిస్కో చెయ్యడం మొదలుపెట్టాయి. బండి గంట నుండి రెండు గంటల లేటు దాకా ఎనౌన్స్ చేసి, ఆ తర్వాత ఎనౌన్స్‌మెంటు చెయ్యడం మానేశారు. పదే పదే వెళ్లి అడిగితే 'బండి పొజిషన్ తెలియదండీ' అని జవాబు. వెలిగి ఆరే లైట్లు మా అందరికి టెన్షన్ పెంచేశాయి. రిజర్వేషన్ బోగీ ఎక్కడొస్తుందో రైల్వే సిబ్బంది ఎవరూ సరిగ్గా చెప్పలేదు.

''అనుకున్నంత అయింది. తీరా రాత్రి రైలు రెండు గంటలకి ప్లాట్‌ఫాం మీద అడుగుపెడుతుంటే కరెంట్ పోయింది. గాఢాంధకారం, బండి అయిదు నిముషాలకన్నా ఆగదు. పట్టపగలే బోగీ వెతకడం కష్టం. అందులో అర్ధరాత్రి, అంధకారం.

''ఎదురుగా కనిపించిన స్లీపర్ కోచ్ కండక్టర్లని అడిగాం, 'నాయనా, బాబూ ఎస్.ఫైవ్ ఎక్కడుందో చెప్పండి' అని వాళ్ల కోచ్ నంబరు తప్ప మిగిలినవి నే నెరుగ - నే నెరుగ నంటూ జవాబు వచ్చింది.

''బండి కదిలే సమయంలో ఎదురుగా ఉన్న స్లీపర్‌లో ఎక్కేశాం. అప్పటికే అటూ - ఇటూ పరుగులు పెట్టిన నా భారీ శరీరం నడ్డి పట్టేసింది. గబుక్కున బేగ్ పడేసి గుమ్మం దగ్గర కూలబడ్డాను.

''ఆ కోచ్ కండక్టరు మీ రిక్కడెక్కేశారు. మీ రిజర్వేషన్ పోతుందని వెళ్ళిపోమని గోల పెట్టారు.

''బండి కదులుతూంటే ఎలా వెళ్లడం నెక్స్ట్ స్టేషన్‌లో వెళతాం అన్నాం.

''చీపురుపల్లిలో ఆగగానే మణి రివ్వున దూసుకువెళ్లాడు. రిజర్వేషన్ బోగీకి. తిరిగి శ్రీకాకుళంలో వచ్చి కండక్టరు లేడని అందులో వాళ్లు తలుపు తియ్యలేదని తమ పక్క నున్న జనరల్ బోగి గుమ్మంలో నించుని వచ్చానని చెప్పాడు. పోనీ పలాసాలో కులాసాగా వెళ్లవచ్చుని కదలకుండా గుమ్మం దగ్గరే కూచున్నాం.

''పలాసాలోనూ గాఢాంధకారం. మమ్మల్ని దిగనివ్వకుండా మనుమలు ఎక్కేశారు.

''కుర్దా రోడ్డు దాకా కదలకుండా గుమ్మం దగ్గరే ఉన్నాం. కుర్దాలో అడిగితే మా బర్తులు వేరెవరికో ఇచ్చేశాం. మీరు విజయనగరంలోనే రావల్సింది అని డ్యూటీ దిగిపోయా డా టి.టి.సి. మా మాట వినిపించుకోకుండా. మరో టి.టి.సి. మాదే తప్పన్నాడు.

''తిరిగి వచ్చి ముందెక్కిన బోగీలోనే కటక్‌లో ఎవరో దిగేదాకా నానా అవస్థలుపడి రెండు సీట్లు సంపాదించి అందరం సర్దుకు కూర్చున్నాం.

''తెల్లవారిన దగ్గర నుండి బాత్‌రూమ్స్‌లో నీళ్లు లేవు. దుర్గంధం ముక్కు పగలగొడుతూంది. బండి అసలే లేటు ఎప్పటికి కలకత్తా చేరుతుందో తెలీదు. ఎంత రిక్వెస్ట్ చేసినా బండికి వాటరింగ్ చేయలేదు.

''రాత్రి పది గంటలకి హౌరా చేరింది. మధ్యాహ్నం మూడు గంటలకి రావాలి న్యాయంగా. బయటికి వస్తే టాక్సీల డిమాండ్ ఎక్కువగా ఉంది.

''అందుకే మారు మాట్లాడకుండా వంద నోటు టాక్సీ వాడి చేతిలో పెట్టి కొంపకి చేరాం.

''ప్రత్యక్ష నరకం ప్రయాణంలోనే ఉందని తెల్సింది.

''ఇది నాయనా మా ప్రయాణ ఘట్టం'' అంటూ పూర్తి చేశాను.

అంతా విన్న సిసింద్రీ ''పిన్నీ! మీదే తప్పు. పోర్టర్‌ని పెట్టుకుంటే ఎంచక్కా రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లో కూచోపెడతాడు గదా!'' అన్నాడు.

''అవున్రా నాయనా! మాదే తప్పు.''

''ప్లాట్‌ఫాం మీద లైట్లు వెలక్కపోవడం రైల్వే వారి తప్పు కాదు.

''రిజర్వేషన్ బోగీ ఎక్కడొస్తుందో చెప్పలేకపోవడం రైల్వే సిబ్బంది తప్పు కాదు.

''బండితో వచ్చిన టి.టి.సి.లకి మరో స్లీపర్ కోచ్ గురించి తెలియకపోవడం తప్పు కాదు.

''ఎస్. పక్కని సుద్దముక్కతో కనీ కనుపించని నెంబర్లు రాయడం తప్పు కాదు. అయిదు నిముషాలు ఆగే స్టేషన్‌లో అంధకారంలో ఎప్పుడో ఒకసారి ఎక్కే బండిలో సరియైన కోచ్‌ని పట్టుకోలేని పాసింజర్లదే తప్పు.'' ఆవేశంగా అన్నాను.

# బి.యస్.రెడ్డి స్క్రిప్ట్ 'సీత' (లవకుశ)



1955 మార్చి 19వ తేదీన విడుదలైన వాహినీ వారి 'బంగారుపాప' రాష్ట్రపతి స్వర్ణపతకానికి పోటీ చేసింది. ఆ ఏడు వి.శాంతారాంగారి 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే' (హిందీ — టెక్నికలర్), సత్యజిత్‌రాయ్‌గారి 'పథేర్ పాంచాలి' (బెంగాలి), బి.ఎన్.రెడ్డిగారి 'బంగారు పాప' (తెలుగు) స్వర్ణపతకం పోటీలో నిలిచాయి. కేవలం రంగులలో తీసిన నృత్య ప్రధాన చిత్రమని 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే'ను జడ్జీలు మొదటి రోజే తొలగించారు. పథేర్ పాంచాలి', 'బంగారు పాప' చివరివరకూ పోటీలో నిలబడ్డాయి. మూడు రోజుల అనంతరం కేవలం మూడు మార్కుల తేడాతో 'పథేర్ పాంచాలి' స్వర్ణపతకానికి ఎన్నికైంది. తెలుగువారి దురదృష్టానికి ఇది పెద్ద ఉదాహరణ. (పథేర్ పాంచాలి ఆ ఏడు లేకుంటే తెలుగువారికి 1955లోనే స్వర్ణపతకం లభించి ఉండేది. ఏమైనా ఈ 40 ఏళ్లలో (1994 వరకూ తెలుగు చిత్రానికి ఒక్కసారి కూడా స్వర్ణపతకం లభించలేదు). ఆ ఏడు 'బంగారుపాప'కు రాష్ట్రపతి రజత పతకం (దక్షిణాది మొత్తానికి), ఆల్ ఇండియా మెరిట్ సర్టిఫికెట్ లభించాయి. ఆరు బహుమతు లిచ్చింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం బి.ఎన్.రెడ్డి, ఉత్తమ నటుడు ఎస్.వి.రంగారావు, ఉత్తమ సహాయ నటి పి.హేమలత, ఉత్తమ రచయిత పాలగుమ్మి పద్మరాజు, ఉత్తమ గేయ రచన "తాథిమి తకథిమి తోల్ బొమ్మా" (దేవులపల్లి కృష్ణశాస్త్రి.) మొత్తం ఆరు బహుమతులు మద్రాసు ఫిలిం ఫాన్స్ అసోసియేషన్ ఇచ్చింది.

తర్వాత 'బంగారుపాప' 1962లో లండన్ ఫిలిం ఫెస్టివల్‌లో బహుమతి పొందింది. తిరిగి 1971లో న్యూయార్క్ వెళ్లింది. ప్రపంచ ప్రఖ్యాత హాస్య నటుడు చార్లీ చాప్లిన్ 'జార్జి ఇలియట్ బ్రతికుంటే తన నవల 'సైలాస్ మార్నర్' కన్న 'బంగారు పాప' చిత్రం ఇంకా గొప్పగా ఉందని మెచ్చుకునేది'' అన్నాడు. ఇంత గొప్ప 'బంగారు పాప' 1955లో ఆర్థికంగా ఫ్లాపయింది. బి.ఎన్.రెడ్డి మానసికంగా క్రుంగిపోయారు. వెంటనే తమ్ముడు నాగిరెడ్డి తమ విజయా వారి 'లవకుశ'కు దర్శకత్వం వహించమని కోరారు. బి.ఎన్. మైసూరు చాముండేశ్వరీ ఆలయంలో కూర్చొని ఎంతో పవిత్రంగా 'లవకుశ' స్క్రిప్టు రాశారు. కానీ విజయా వారు తీయనే లేదు. తర్వాత శంకరరెడ్డి కలర్‌లో 'లవకుశ' తీస్తే సంవత్సరం ఆడింది. దర్శకుడు సి.పుల్లయ్య చనిపోవటంతో 'లవకుశ'ను బి.ఎన్.ను తీయమన్నారు. కానీ పుల్లయ్య కుమారుడు సి.ఎస్.రావుకు అప్పగించారు బి.ఎన్. 1974లో బి.ఎన్.కు పద్మభూషణ్ 1975లో ఫాల్కే అవార్డు వచ్చాయి. ఆంధ్ర దేశంలో జరిగిన అనేక సన్మానసభలకు బి.ఎన్.గారు నన్ను కావాలని ఉపన్యాసకుడుగా పిలిపించారు. తర్వాత వాహినీ సంస్థలే 'సీత' (లవకుశ) తీద్దామన్నారు. పాలగుమ్మి పద్మరాజు, బి.ఎన్. రాసిన స్క్రిప్టులో నా హస్తమూ ఉంది. మళ్లీ ఆగిపోయింది. చివరకు బి.ఎన్. ఆ స్క్రిప్టు ఎన్.టి.రామారావు కిచ్చేశారు. బి.ఎన్. చేతే తీయించాలని ఎన్.టి.ఆర్ అనుకున్నారు. ఈలోగా బి.ఎన్. 1977 నవంబర్ 8న అస్తమించారు.

మల్లీప్రియ నాగరాజు (గుంటూరు)

---

"స్టాప్, బుజ్జీ, స్టాప్. ను వ్వన్నవన్నీ కరెక్ట్, కానీ మా పరిస్థితి ఆలోచించు. ఈ ఇంట్లో ఏ వస్తువెక్కడుంటుందో గుర్తించలేని అర్భకులం. కంచం దగ్గర కూచుంటే గానీ కూరేంటో తెలియని అమాయకులం. మా బోగీ మా డ్యూటీ తప్ప మిగిలిన వాటి గురించి ఎలా తెలుస్తుంది చెప్పు."

"పోనీ ఏం చెయ్యలేకపోయినా కోటా సీట్లు ఉన్న చోట బండి పది నిముషాలు ఆపొచ్చు గదా! చాంతాడంత బండిలో బోగీ వెతుక్కోడానికి సరిపోతుంది" అన్నా.

"నాన్నా! మీ రైల్వేల ప్రవర్తనకి మీరు సిగ్గుపడాలి." సీరియస్‌గా అన్నాడు సిసింద్రీ

"సిగ్గు - శరం వదిలేశాను గనుకే ఉద్యోగంలో చేరానురా నా తండ్రీ. మమ్మల్ని తెల్లవారిం దగ్గరనుండి ఎంతమంది తిట్టుకుంటారో లెఖ్ఖా జమా లేను. అయినా మా సేవలు నిష్పక్షపాతంగా అందరికి అందిస్తూనే ఉంటాం అయినా అందరి చేతా తిట్లు తినేది రైల్వేలే. ఏమంటావు కాంతి."

"అబ్బే! మిమ్మల్నే తిడుతున్నారని బాధపడకండి. మీకు కరెంటు వాళ్లూ తోడున్నారు. మీరు ప్రయాణాల్లో బాధపెడితే వాళ్లు ప్రతిరోజూ పీక్కుతింటారు."

"భార్యంటే బాధపెట్టేదని నిరూపించావ్ గదే కాంతి." ఉస్సురని నిట్టూరుస్తూ అంటున్న మూర్తిని చూసి మే మందరం నవ్వుతుంటే.

"ఓహో! బాధంటూ మిగిలే ఉందన్నమాట - అది కూడా ఉద్యోగంలో చేరగానే పోయిం దనుకున్నాను" అంది కాంతి.

ఆ తర్వాత చాలా సేపు పనికిరాని చర్చలు జరిపి పక్కల మీదికి చేరాం.

ఉదయం లేచాక ఆ రోజు హడావిడి ఏదీ లేనందువల్ల మావారూ, పిల్లలూ విజయనగరం వెళ్లారు. అక్కడ మా మరిది వాళ్ల దగ్గర అత్తగారు ఉన్నారు. నేను మాత్రం పెళ్లయ్యాకే వెళ్లదల్చుకున్నాను.

రాత్రికి మా వాళ్లు తిరిగి వచ్చేశారు.

ఏర్పాట్లన్నీ బ్రహ్మాండంగా చేశారేమో పెళ్లి బాగా, చాలా సరదాగా జరిగిపోయింది. మర్నాడు మెయిల్లో మావారు, పిల్లలు తిన్నగా కలకత్తా వెళ్లిపోయారు.

మరో రెండు రోజులు కాంతికి సాయం ఉండి, నేను విజయనగరం వెళ్లాను. నాకు అక్కడి నుంచే రిజర్వేషన్ చేయించడంతో తిరిగి వైజాగ్ వచ్చే ప్రసక్తి లేదు. లగేజి మా వాళ్లు చేత పంపించెయ్యడం వల్ల చిన్న ట్రావెలింగ్ బేగ్, హేండ్‌బాగ్ తప్ప మరేమీ లేవు.

ఒక రోజు మా మరిది గారింట్లో సరదాగా గడిపి మర్నాడు ప్రయాణం అయ్యాను. పెళ్లిళ్లు సీజను కావడంతో ఈమారూ ఈస్ట్-కోస్టకే దొరికింది.

బండి గంటన్నర లేటు. మా మరిది ప్లాట్‌ఫాం టిక్కెట్ తెచ్చుకుందుకు వెళ్లగానే పోర్టరుని మాట్లాడాను. నన్నూ నా బేగ్‌ని వింతగా చూస్తూ ఒకంతట అందుకోడే! గట్టిగా దబాయించి 'నీ కూలి నీ కిస్తాను గదా! రిజర్వేషన్ బోగీలో పెట్టు' అన్నాను.

బేగ్ అందుకుని వెనక్కి తిరిగి చూస్తూ ముందు కెళుతున్నాడు. ఠీవిగా పోర్టరు వెంట నడుస్తున్నాను. మా మరిది గొణుక్కుంటూ రావడం కనపడింది. బహుశా, 'మా వదినకి మతిపోయినట్లుంది ఈ చిన్న బేగ్‌కి పోర్టరేమిట'ని కాబోలు - అబ్బెబ్బె! ఇది నా ఊహ సుమండీ! మా మరిది గొణుగుడు నిజంగా నాకు వినబడలేదు.

లైట్లు దేదీప్యమానంగా వెలుగుతుండగా బండి వచ్చి ఆగింది. పోర్టరు ధర్మమా అని సునాయాసంగా రిజర్వేషన్ బోగీ ఎక్కేశాను. బండి కదలగానే బెర్త్ వాల్చి ఉండడంతో ఆనందంగా మేను వాల్చాను.

చల్లటి గాలికి చిన్నగా మగత. అందులో అతి చక్కని కల. స్టేషన్‌లో అడుగుపెడుతుండగానే జగ్గయ్య గొంతు కంత మధురమైన కంఠంతో మూడు భాషల్లో ముచ్చటగా అర్థం అవుతున్న ఎనౌన్స్‌మెంట్. బండి రైట్ టైమ్‌కి వస్తూందని, అలా అడుగులు వేయగానే దబ్బకాయంత అక్షరాలలో 'కోటా బర్తులు ఆగే దిక్కడే' అన్న బోర్డు వేళ్లాడుతూ కనిపించింది. అంతలో నల్లకోటు మనిషి బోర్డు కిందనే నుంచుని ఉన్నాడు. దగ్గర కెళ్లి 'సార్!' అనగానే అతిమృదువుగా, అతి సౌమ్యంగా 'రిజర్వేషనా? ఇక్కడే ఆగుతుంది' చిరునవ్వుతో జవాబిచ్చాడు.

కలకలంతో కల చెదిరింది. ఫాన్లు తిరగడం లేదు అదీ గోల. అవతల బెర్తులలో లైట్లు వెలగడం లేదు. బాత్‌రూమ్ తలుపు సరిగ్గా పడడంలేదు. అరెరె! కుళాయిలో నీరు ఊరికే కారిపోతూంది.

అందరూ కలగాపులగంగా మాట్లాడేస్తున్నారు. ఇంతలో టిటిసి చెకింగుకి రావడంతో అందరూ అన్ని రకాల ఫిర్యాదులు చేస్తుంటే -

"న న్నేం చెయ్యమంటారు? నా డ్యూటీ టికెట్స్ చెక్ చెయ్యడం మాత్రమే." టిటిసి జవాబు.

ఒక రిద్దరు ఊరుకోలేదు. దాంతో మాటా మాట పెరిగింది. గట్టిగా అరుపులు - కేకలు.

ప్రయాణికులకు కొంత కాలక్షేపం, కొంతమందికి వినుగు. సద్దు మణిగేసరికి అర్థరాత్రి దాటింది.

తెల్లారేసరికి నీళ్లుండవు. ఆ తర్వాత బండికి వాటరింగ్ ఉండదు.

ప్రయాణాలు చేసినప్పు డల్లా ఈ బాధలు తప్పవు. రైలు ఛార్జీలు విపరీతంగా పెరిగినా, కనీస సదుపాయాలు లేకున్నా అంతులేని జనం ప్రయాణాలు చేస్తూనే ఉన్నారు. సహనం మన భారతీయ సంస్కృతికి చిహ్నం.

ఎప్పటికైనా హాయిగా చీకూ చింతా లేకుండా ప్రయాణాలు చేసే రోజు వస్తుందని కలలు కంటూ - ప్రస్తుతానికి తిట్టుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రయాణ వైరాగ్యంలో పడిపోతూ - అందాకా మళ్లీ మళ్లీ ప్రయాణాలు చేస్తూనే ఉండడం తప్పదు కదా! మన అవసరం!

●